క్లుప్తంగా

నేటి నుంచి క్రీడా పోటీలు ప్రారంభం

ఐ.పోలవరం: ప్రభుత్వ, ప్రైవేటు ఉన్నత పాఠశాలల్లో మంగళవారం క్రీడా పోటీలు నిర్వహిస్తున్నట్లు ఎంఈవోలు ఎస్.కొండారెడ్డి, కె.తిరుమలరావులు సోమవారం తెలిపారు. కోనసీమ క్రీడోత్సవం- ఆటలతో ఆరోగ్యం పేరిట మండల స్థాయి నుంచి జిల్లా స్థాయి వరకు మంగళవారం నుంచి 9వ తేదీ వరకు పోటీలు జరుగుతాయని చెప్పారు. మండల పరిధిలోని అన్ని ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలకు చెందిన 4వ తరగతి నుంచి 9వ తరగతి వరకు విద్యార్థులు పోటీల్లో పాల్గొంటారన్నారు.

నాగజ్యోతికి సిరికోన పురస్కారం

ఐ.పోలవరం: తెలంగాణాకు చెందిన సిరికోన సాహితి, కిన్నెర ఆర్ట్స్ అకాడమీల సంయుక్త ఆధ్వర్యంలో సిరికోన సప్తమ సాహిత్యోత్సవం సందర్భంగా విశిష్ట ప్రతిభా పురస్కారాలు ప్రకటించారు. సిరికోన-2024 విశిష్ట సృజనా పురస్కారాల్లో భాగంగా వచన కవిత్వానికి గానూ ఉత్తమ కవితా రచన పురస్కారానికి ఐ.పోలవరం మండలం మురుమళ్లకు చెందిన ఉపాధ్యాయురాలు, రచయిత్రి దొండపాటి నాగజ్యోతి ఎంపికయ్యారు. ఈ పురస్కారాన్ని ఈ నెల 12వ తేదీన రవీంద్ర భారతిలో ఆచార్య అప్పాజోస్యుల సత్యనారాయణ చేతుల మీదుగా ఆమె అందుకోనున్నారు. ఈ విశిష్ట పురస్కారానికి నాగజ్యోతి ఎంపిక కావడం పట్ల ముమ్మిడివరం ఎమ్మెల్యే దాట్ల సుబ్బరాజు, సాహితీ స్రవంతి నగర అధ్యక్షులు మార్ని జానకిరామ్ చౌదరి, పీటీఎం వ్యవస్థాపకులు పుల్లెపు వెంకటేశ్వరరావు, వీధి సురేష్ బాబు, డా.కెఎల్‌వి ప్రసాద్, ఎంఈవో మంగాయమ్మ, పలువురు సాహితీవేత్తలు హర్షం వ్యక్తం చేశారు.

జాబ్‌మేళాలో 29 మందికి ఉద్యోగావకాశాలు



జాబ్‌మేళాలో పాల్గొన్న అభ్యర్థులు

ముమ్మిడివరం: ఏపీ నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ముమ్మిడివరం ఎయిమ్స్ ఇంజినీరింగ్ కళాశాలలో సోమవారం నిర్వహించిన జాబ్‌మేళాలో 29 మంది ఎంపికైనట్లు జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి డి.హరిశేషు తెలిపారు. మూడు ప్రధాన కంపెనీలు పాల్గొన్న ఈ జాబ్‌మేళాలో 71 మంది నిరుద్యోగ యువకులు ఇంటర్వ్యూలకు హాజరైనట్లు చెప్పారు. వీరిలో 29 మందిని ఎంపిక చేశారు. ఈ కార్యక్రమంలో డీపీఓ రాజేంద్ర, ముమ్మిడివరం స్కిల్ హబ్ కోఆర్డినేటర్ శ్రీదేవి, సిబ్బంది పాల్గొన్నారు.

దాతల సహకారంతో సదుపాయాల కల్పన

ఐ.పోలవరం: దాతల సహకారంతో పాఠశాలల్లో విద్యార్థులకు పలు రకాల సదుపాయాలు కల్పించే అవకాశం దక్కుతోందని పశువుల్లంక జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యా కమిటీ చైర్మన్ దుర్గా ప్రసాద్ అన్నారు. పాఠశాలకు జీఎస్‌బీఎన్ రెడ్డి ట్రస్టు ఆధ్వర్యంలో గిడ్డి ప్రభాకర రెడ్డి రూ.26 వేలు విలువ చేసే కంప్యూటర్‌ను సోమవారం బహూకరించారు. ఆయనను హెచ్‌ఎం మూర్తి, రాంబాబులు సత్కరించారు.

బాల కృష్ణమ్మ సేవలు ఎనలేనివి

ఐ.పోలవరం: ఉపాధ్యాయ ఉద్యమ పితామహుడిగా పేరుగాంచిన బాల కృష్ణమ్మ సేవలు ఎనలేనివని జి.వేమవరం జెడ్పీ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం సలాది వెంకట్ నారాయణన్ అన్నారు. స్థానిక పాఠశాలలో బాలకృష్ణమ్మ వర్ధంతి సందర్భంగా సోమవారం ఆయన చిత్ర పటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్షులు ఎస్ఎస్.మునీశ్వరరావు, ప్రధాన కార్యదర్శి కుందుర్తి వీర వెంకటరావు, శ్రీమన్నారాయణ, పి. రామకృష్ణ, నేరేడిమిల్లి శ్రీనివాస్, అనూరాధలు పాల్గొన్నారు.

కోనసీమ క్రీడోత్సవాలను విజయవంతం చేయాలి

అల్లవరం: కొమరగిరిపట్నం ఉన్నత పాఠశాలలో ఈ నెల 7 నుంచి 9 వరకు నిర్వహించనున్న కోనసీమ క్రీడోత్సవాలను విజయవంతం చేయాలని ఎంపీడీఓ కృష్ణమోహన్ అన్నారు. అల్లవరం మండల పరిషత్ కార్యాలయంలో ఫిజికల్ డైరెక్టర్లు, పంచాయతీ కార్యదర్శులతో సోమవారం సమీక్ష నిర్వహించారు. మూడు రోజుల పాటు జరిగే ఈ క్రీడల్లో వాలీబాల్, ఖోఖో, ఇతర క్రీడల నిర్వహణ ఉంటుందన్నారు. ప్రతి పాఠశాల నుంచి క్రీడాకారులు పాల్గొనే విధంగా విద్యాశాఖ అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎంఈఓ-2 కిరణ్‌బాబు, పీడీ ముసలయ్య, కార్యదర్శులు చిక్కం శ్రీను, రాజమోహన్, దుర్గా శ్రీను, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

గ్రంథాలయ గదికి శంకుస్థాపన

ఉప్పలగుప్తం: మండలంలోని గొల్లవిల్లి జెడ్పీ ఉన్నత పాఠశాలలో నూతనంగా నిర్మిస్తున్న గ్రంథాలయ గదికి అమలాపురం ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు సోమవారం శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ జొన్నాడ శ్రీదుర్గ, ఎంపీటీసీ సభ్యురాలు దోనిపాటి బాలమ్మ, హెచ్‌ఎం లంకా రాణి, పీఎంసీ చైర్మన్ వాలా సత్యనారాయణ, నీటి సంఘం అధ్యక్షుడు నల్లా సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఫిర్యాదులకు పరిష్కారమేదీ..!

- తూతూ మంత్రంగా ప్రజా సమస్యల పరిష్కార వేదిక
- పరిష్కరించకుండానే అర్జీలకు స్వస్తి పలుకుతున్న వైనం
- ప్రజా సమస్యలు పట్టని అధికారులు
- గగ్గోలు పెడుతున్న బాధితులు



తొలగించాలని ఫిర్యాదు చేసినా అధికారులు పట్టించుకోక పోవడంతో సీసీ రోడ్డుకు అడ్డుగా మారిన విద్యుత్ స్తంభం

అల్లవరం: ప్రతి సోమవారం మండల కార్యాలయాల్లో నిర్వహిస్తున్న ప్రజా సమస్యల పరిష్కార వేదిక కొందరికే అన్న చందంగా మారింది. బాధితుల నుంచి ఫిర్యాదులు స్వీకరిస్తున్నా వాటిని పరిష్కరించడంలో అధికారులు విఫలమవుతున్నారు. ప్రజా సమస్యల పరిష్కార వేదికకు వచ్చే ప్రతి ఫిర్యాదును ఆన్‌లైన్ చేసి నిర్ణీత గడువులోగా వాటిని పరిష్కరించాల్సి ఉంది. అయితే వీటిని పరిష్కరించడంలో అధికారులు మీనమేషాలు లెక్కిస్తున్నారు.

స్పందనతో పేదలకు లబ్ధి

వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో స్పందనకు వచ్చే ప్రతి ఫిర్యాదును ఆన్‌లైన్ చేసి పదిహేను రోజుల వ్యవధిలో సమస్యకు పరిష్కారం చూపేవారు. ప్రతి ఫిర్యాదును ఆన్‌లైన్ చేసి ఫిర్యాదు దారుడికి రశీదు ఇచ్చేశారు. ఫిర్యాదుపై స్పందన కేంద్ర కార్యాలయం నుంచి ఐవీఆర్ విధానంలో ఫిర్యాదు దారుడితో మాట్లాడి ప్రతి ఫిర్యాదుకు పరిష్కారం చూపేవారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రజా సమస్యల పరిష్కార వేదిక ద్వారా ప్రతి సోమవారం ఫిర్యాదులు స్వీకరిస్తున్నారు. ప్రజల నుంచి స్వీకరిస్తున్న ఫిర్యాదుల్లో కొన్ని మాత్రమే పరిష్కారానికి నోచుకుంటున్నాయి. చాలా ఫిర్యాదులు ఆన్‌లైన్‌లో నమోదు కావడం లేదు. కొన్ని ఫిర్యాదులను పరిష్కరించకుండానే పరిష్కారం చేసినట్లుగా అధికారులు క్లోజ్ చేస్తున్నారు. కనీసం క్షేత్ర స్థాయిలో పరిశీలన కూడా చేయకుండా ఏలాంటి సమాచారం ఇవ్వకుండానే వాటికి స్వస్తి పలుకుతున్నారు. ఉప్పలగుప్తం మండలంలో ప్రజా సమస్యల పరిష్కార వేదికకు వచ్చే ఫిర్యాదులను కార్యాలయ రికార్డులో సైతం నమోదు చేయకపోవడంపై పలు విమర్శలకు దారీ తీస్తోంది. ప్రజల నుంచి వస్తున్న ఫిర్యాదులను శాఖల వారీగా విభజించి ఆయా శాఖల అధికారులకు పంపించి పరిష్కారం చూపాల్సి ఉంది. ప్రజల నుంచి వస్తున్న ఫిర్యాదుల్లో ఎక్కువగా రెవెన్యూ, విద్యుత్, తాగునీరు, పంచాయతీ రాజ్, మత్స్యశాఖ నుంచి వస్తున్నాయి.



అల్లవరంలో ఫిర్యాదులు ఆన్‌లైన్ చేస్తున్న అధికారులు (ఫైల్)

స్వీకరించటం ఎందుకు



గుడ్డివాని చింత నుంచి ఎస్.పల్లిపాలెం వరకు రోడ్డు విస్తరణ జరుగుతోంది. ఎస్.పల్లిపాలెంలో 9 మీటర్ల చొప్పున ఆక్రమణలు తొలగించారు. సామంతకుర్రులో మాత్రం 7 మీటర్లు మాత్రమే తొలగించారు. దీనిపై డిసెంబర్ 23న ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ఫిర్యాదు చేశాం. అయితే ఈ ఫిర్యాదుపై అధికారులు కనీసం సమాచారం ఇవ్వకుండానే పరిష్కారం చేసినట్లుగా క్లోజ్ చేశారు. ఐవీఆర్ నుంచి వచ్చిన కాల్ ఆధారంగా మా ఫిర్యాదు క్లోజ్ అయినట్టుగా తెలిసింది. అలాంటప్పుడు ఫిర్యాదులు స్వీకరించడం దేనికి.

– కొల్లు గౌతమ్‌బాబు, ఎస్.పల్లిపాలెం, అల్లవరం మండలం

స్పందించడం లేదు



విలసవిల్లి పంచాయతీ పరిధిలోని వీవర్స్ కాలనీలో సీసీ రోడ్డుకి అడ్డుగా విద్యుత్ స్తంభం ఉంది. ఈ స్తంభాన్ని తొలగించాలని ఫిర్యాదు చేశాం. ఇప్పటికీ స్తంభాన్ని విద్యుత్ అధికారులు తొలగించలేదు. ఫిర్యాదును ఆన్‌లైన్ చేసినా రశీదు ఇవ్వలేదు. మా గ్రామం నుంచి మరికొంత మంది ఫిర్యాదు చేసినా నేటికీ అధికారులు స్పందించడం లేదు.

– పుత్సల చిన వెంకటేశ్వరరావు, విలసవిల్లి, ఉప్పలగుప్తం మండలం

పరిశీలన లేకుండానే ముగించారు

సివిల్ సప్లయ్, డీఎంహెచ్ఓ, టౌన్ ప్లానింగ్ అధికారుల నుంచి అనుమతులు తీసుకొని పేరూరు వై జంక్షన్‌లో అటుకుల మిల్లు ఏర్పాటు చేశాను. మిల్లు ఏర్పాటును పేరూరు పంచాయతీ కార్యదర్శి అడ్డుకున్నారు. దీనిపై ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ఫిర్యాదు చేస్తే కనీసం పరిశీలన కూడా చేయకుండానే నా ఫిర్యాదును క్లోజ్ చేశారు.

– విశ్వనాథ సత్యనారాయణ, స్థానికుడు, కొమరగిరిపట్నం

ప్రభల ఉత్సవాన్ని రాష్ట్ర పండగగా ప్రకటించాలి

అమలాపురం రూరల్: సంక్రాంతి సందర్భంగా జరిగే ప్రభల ఉత్సవాన్ని రాష్ట్ర పండగగా ప్రకటించాలని కోరుతూ ఇందుపల్లి ఉత్సవ కమిటీ సభ్యులు కలెక్టర్ మహేష్ కుమార్‌కు గ్రీవెన్స్‌లో సోమవారం వినతి పత్రం అందజేశారు. 450 ఏళ్ల చరిత్ర కలిగిన కోనసీమలోని జగ్గన్నతోట ప్రభల తీర్థం, 150 గ్రామాల్లో జరిగే ప్రభల ఉత్సవాన్ని రాష్ట్ర పండగగా ప్రకటించాలని కోరారు. ప్రభల ఉత్సవాలకు దేవదాయ శాఖ ఇస్తున్న నిధులు పెంచాలని, ప్రభల తీర్థాలు జరుగుతున్న ప్రాంతాల్లో మౌలిక వసతుల కల్పనకు సీఎస్ఆర్ నిధులు కేటాయించాలని వినతి పత్రంలో కోరారు. వినతి పత్రం అందజేసిన వారిలో ఉత్సవ కమిటీ నిర్వాహకులు గిడుగు సుబ్బారాయుడు, ఆకెళ్ల నారాయణమూర్తి, వెంపరాల శ్రీరామచంద్రమూర్తి, వంక భాను తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు విస్తరణపై కలెక్టర్‌కు ఫిర్యాదు

అల్లవరం: గుడ్డివానిచింత నుంచి ఎస్.పల్లిపాలెం వరకు సెంట్రల్ రిజర్వు ఫండ్ నిధులు రూ. 19 కోట్లతో విస్తరిస్తున్న రోడ్డు నిర్మాణ పనులతో ఎస్సీ, బీసీలకు తీవ్ర అన్యాయం జరుగుతుందని ఎస్.పల్లిపాలెం గ్రామానికి చెందిన కొప్పాడి నాగేశ్వరరావు, కొల్లు గౌతమ్‌బాబులు సోమవారం అమలాపురంలోని ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ఫిర్యాదు చేశారు. ఎస్.పల్లిపాలెంలో ఎస్సీ, బీసీ ప్రాంతాల్లో బీటీ రోడ్డు నిర్మాణం కోసం 9 మీటర్ల వెడల్పున ఇళ్లు, ప్రహరీ గోడలు తొలగించి విస్తరణ పనులు చేశారని సామంతకుర్రు ఓసీ ఏరియాలో ఇళ్లు, ప్రహరీలకు నష్టం లేకుండా 7 మీటర్ల వెడల్పులో మాత్రమే తొలగించి పనులు చేస్తున్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఎస్సీ, బీసీల పట్ల చిన్న చూపుతో అన్యాయం చేస్తున్నారని వారు ఆవేదన వ్యక్తం చేశారు.

అట్టహాసంగా ప్రజా ఉత్సవాలు ప్రారంభం



అలరించిన చిన్నారుల నృత్య ప్రదర్శన



ఉత్సవాలను ప్రారంభిస్తున్న సీఎం రంగసామి, చిత్రంలో ఎమ్మెల్యే అశోక్, పుదుచ్చేరి ప్రభుత్వ ఢిల్లీ ప్రతినిధి మల్లాడి, మంత్రులు

- హాజరైన సీఎం రంగసామి, మంత్రులు
- ఆకట్టుకున్న ఫల, పుష్ప ప్రదర్శన
- అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు
- తరలి వచ్చిన జన సందోహం

యానాం: 21వ యానాం ప్రజా ఉత్సవాలు స్థానిక బాలయోగి స్టేడియంలో సోమవారం రాత్రి అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. దీంతో పాటు ఫల, పుష్ప ప్రదర్శన సైతం ప్రారంభం కావడంతో దీనిని వీక్షించేందుకు చూపరులు అధిక సంఖ్యలో తరలి వచ్చారు. దీంతో బాలయోగి స్టేడియం కిటకిటలాడింది. ముఖ్య అతిథిగా సీఎం ఎన్ రంగసామి హాజరై జ్యోతి ప్రజ్వలన గావించి ఉత్సవాలను ప్రారంభించారు. స్పీకర్ సెల్వం, మంత్రులు కె లక్ష్మీ నారాయణన్, డీజే కుమార్, తిరుమురుగన్, రాజేవేలు, పలువురు ఎమ్మెల్యేలు హాజరయ్యారు. ఉత్సవాలకు సభాధ్యక్షుడిగా గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్ వ్యవహరించగా పుదుచ్చేరి ప్రత్యేక ఢిల్లీ ప్రతినిధి మల్లాడి కృష్ణారావు ఏర్పాట్లను పర్యవేక్షించారు. అనంతరం సీఎం రంగసామి మాట్లాడుతూ యానాం అభివృద్ధికి ఎల్లవేళలా సహాయ సహకారాలు అందిస్తామన్నారు. ఎమ్మెల్యే గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్ మాట్లాడుతూ కోట్లాది రూపాయలతో నిర్మాణాలకు, పలు అభివృద్ధి పనులకు వేదికపై నుంచే భూమి పూజలు చేయడం పట్ల సీఎం రంగసామికి కృతజ్ఞతలు తెలిపారు. విద్య, వైద్య రంగాల అభివృద్ధికి కృషి చేయాల్సి ఉందన్నారు. పుదుచ్చేరి ప్రభుత్వ ప్రతినిధి మల్లాడి కృష్ణారావు మాట్లాడుతూ ఏటా లక్షలాది రూపాయల ఖర్చుతో ప్రజా ఉత్సవాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు.



ఆకర్షించిన ఫల, పుష్ప ప్రదర్శన సెట్టింగు

వేదికపై నుంచే భూమి పూజలు

సీఎస్ఆర్ నిధులు రూ.29.79 కోట్లతో మెట్టకూరు గణపతి నగర్‌లో చేపట్టే సీవరేజ్ ప్లాంట్‌తో పాటు రూ.14.31 కోట్లతో చేపట్టే మరో 52 ప్రాజెక్టులకు సీఎం రంగసామి వేదికపై నుంచే భూమి పూజ చేశా రు. రూ.50 లక్షలతో నిర్మాణం చేసిన ఒన్ స్టాప్ సెంటర్‌ను ప్రారంభించారు. రూ.96 కోట్ల ఓఎన్‌జీసీ పరిహారాన్ని మత్స్యకారులకు అందించారు. కార్యక్రమంలో ఆర్ఏఓ మునిస్వామి తదితరులు పాల్గొన్నారు.

వృత్తి నైపుణ్యంతో ఉద్యోగావకాశాలు



మాట్లాడుతున్న ఏపీ స్టేట్ ఫార్మసీ కౌన్సిల్ రిజిస్ట్రార్ విలియం కేరీ

తాళ్లరేవు: విద్యార్థినీ విద్యార్థులు చదువుతో పాటు మారుతున్న టెక్నాలజీకి అనుగుణంగా వృత్తి నైపుణ్యాలను పెంపొందించుకోవడం ద్వారా మంచి ఉద్యోగావకాశాలు పొందవచ్చని ఏపీ స్టేట్ ఫార్మసీ కౌన్సిల్ రిజిస్ట్రార్ విలియం కేరీ అన్నారు. సోమవారం కోరింగా కాలేజ్ ఆఫ్ ఫార్మసీలో ప్రధానమంత్రి కౌశల్ వికాస్ యోజన స్కిల్ ట్రెనింగ్ ప్రోగ్రామ్‌ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఫార్మసీ రంగంలో అనేక ఉద్యోగ, ఉపాధి అవకాశాలు ఉన్నాయన్నారు. విద్యార్థులను ఇండస్ట్రియల్ టూర్‌లకు పంపించడం ద్వారా మారుతున్న సాంకేతిక పరిజ్ఞానంపై అవగాహన కలుగుతుందన్నారు. కార్యక్రమంలో కళాశాల చైర్మన్ దున్నా జనార్ధనరావు, కళాశాల కరస్పాండెంట్ ప్రగళ్లపాటి కనకరాజు, డైరెక్టర్ చిట్టూరి కలికిమూర్తి, ప్రిన్సిపాల్ సువర్ణజ్యోతి, ఏపీ స్టేట్ ఫార్మసీ కౌన్సిల్ సభ్యులు ఎస్ఎల్ఎస్ ప్రసాదరెడ్డి, జి.దుర్గా ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

భూముల రీసర్వే పై అవగాహన ర్యాలీ



పటవలలో రీసర్వే అవగాహనా ర్యాలీ నిర్వహిస్తున్న రెవెన్యూ అధికారులు

తాళ్లరేవు: ప్రభుత్వం నిర్వహిస్తున్న భూముల రీసర్వే కార్యక్రమంపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు సోమవారం పటవల పంచాయతీలో బైక్ ర్యాలీ నిర్వహించారు. స్థానిక మట్లపాలెం మహాలక్ష్మమ్మ ఆలయం వద్ద ఈ ర్యాలీని ఎంపీపీ రాయుడు సునీత ప్రారంభించారు. ఎంపీపీ మాట్లాడుతూ భూ సమస్యల శాశ్వత పరిష్కారం కోసం ప్రభుత్వం రీసర్వే నిర్వహిస్తుందన్నారు. తహసీల్దార్ పితాని త్రినాథరావు మాట్లాడుతూ రైతుకు మేలు చేయడమే లక్ష్యంగా ప్రభుత్వం రీసర్వే నిర్వహిస్తుందన్నారు. కార్యక్రమంలో మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ ఉంగరాల వెంకటేశ్వరరావు, జగన్నాథగిరి డీసీ వైస్ చైర్మన్ కొత్తూరు కాశీ ఈశ్వరుడు డిప్యూటీ తహసీల్దార్ టి.సూరిబాబు, రీసర్వే డీటీ వీరబాబు, ఆర్ఐ రామకృష్ణ, మండల సర్వేయర్ షఫీఉల్లా, పంచాయతీ కార్యదర్శి ఏవీ రామరాజు, వీఆర్వోలు, సచివాలయ సర్వేయర్‌లు పాల్గొన్నారు.

సమస్యలపై గళమెత్తిన ప్రజా ప్రతినిధులు

వాడీవేడిగా సర్వసభ్య సమావేశం



సమావేశంలో అధికారులను ప్రశ్నిస్తున్న ఎంపీపీ భాగ్యలక్ష్మి

అమలాపురం రూరల్: మండల సమావేశంలో ప్రజా సమస్యలపై ప్రజా ప్రతినిధులు గళమెత్తారు. సోమవారం ఎంపీపీ కుడుపూడి భాగ్యలక్ష్మి అధ్యక్షతన సర్వసభ్య సమావేశం జరిగింది. సభ్యులు అడిగే ప్రశ్నలకు అధికారులు సమాధానాలు చెప్పలేక నీళ్లు నములుతూ సమస్యను దారి మళ్లించే ప్రయత్నం చేశారు. డ్రైనేజీల ఆక్రమణలపై ఏఈ సునీతను, పంట కాలువల్లో కలుస్తున్న వ్యర్థాలపై ఇరిగేషన్ ఏఈ రెహమాన్‌ను ప్రజా ప్రతినిధులు నిలదీశారు. అధికారులు సరైన సమాధానాలు చెప్పకుండా ప్రశ్నలను దాటవేశారు. హౌసింగ్ ఏఈ వినాయక వర్మ మాట్లాడుతూ 2014 -2019 పెండింగ్ బిల్లులపై సర్వే చేస్తున్నామని చెప్పుకొచ్చారు. కట్టేసిన ఇళ్లకు ఎప్పుడు బిల్లులు ఇస్తారని సర్పంచ్ గుత్తుల చిరంజీవిరావు ప్రశ్నించారు. 2019–2024లో గృహ నిర్మాణాల స్కీం లేనప్పుడు ఎందుకు దరఖాస్తులు తీసుకున్నారంటూ సర్పంచ్‌లు చిరంజీవి రావు, చెల్లుబోయిన వెంకటేశ్వరరావులు ప్రశ్నించారు. గత ప్రభుత్వంలో గృహ నిర్మాణాల కోసం సర్వే చేసి గుర్తించిన జాబితాను పక్కన పెట్టేసి మళ్లీ కొత్తగా జాబితా కోసం సర్వే చేయటం ఏమిటని ప్రజా ప్రతినిధులు ప్రశ్నించారు. గ్రామాల్లో విద్యుత్ సమస్యలపై ఎంపీటీసీలు, సర్పంచ్‌లు ప్రశ్నల వర్షం కురిపించారు. ఆక్రమణల గురించి ఏమి చర్యలు తీసుకున్నారంటూ జెడ్పీటీసీ సభ్యుడు పందిరి శ్రీహరి రామ్ గోపాల్ ప్రశ్నించారు. చిందాడగురువులో తరచూ కరెంటు కట్ అవుతుందని పాత లైన్ ద్వారా విద్యుత్ సరఫరా చేయాలంటూ విద్యుత్ శాఖ ఏఈని ఎంపీటీసీ సభ్యురాలు మోటూరి కనకదుర్గ కోరారు. సమావేశంలో వైస్ ఎంపీపీ పొలమూరి బాలకృష్ణ, ఎంపీడీవో బాబ్జీ రాజు తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ సరఫరాకు నేడు అంతరాయం

తాళ్లరేవు: మండల పరిధిలోని పలు గ్రామాలలో మంగళవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఏపీఈపీడీసీఎల్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఎస్.ఉదయ్ భాస్కర్ సోమవారం తెలిపారు. తాళ్లరేవు సబ్‌స్టేషన్‌లో పవర్ ట్రాన్స్‌ఫార్మర్ మార్పు నిమిత్తం ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు తాళ్లరేవు, సీతారామపురం, పి.మల్లవరం, పోలేకుర్రు, కోరంగి, గాడిమొగ, భైరవపాలెం, చినవలసల, పెద వలసల, జార్జీపేట, నీలపల్లి గ్రామాలకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందన్నారు.

ఓటర్ల జాబితా విడుదల

యానాం: ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు స్పెషల్ సమ్మరీ రివిజన్ అనంతరం సోమవారం ఆర్డీఓ మునిస్వామి ఓటర్ల జాబితాను విడుదల చేశారు. యానాం నియోజకవర్గంలో మొత్తం ఓటర్లు జనవరి1, 2025 నాటికి 39,622 మంది ఉండగా అందులో పురుష ఓటర్లు 19,163 మంది, మహిళా ఓటర్లు 20 వేల 459 మంది ఉన్నారని తెలిపారు. 6ఏ ఫారాలు 492 రాగా అందులో 455 ఫారాలను అంగీకరించామని చెప్పారు. తొలగింపులకు 94 దరఖాస్తులు రాగా 93 అంగీకరించామన్నారు. కార్యక్రమంలో ఎన్నికల శాఖ సిబ్బంది తిరుకోటి అర్జునరావు తదితరులు పాల్గొన్నారు.

గుండెపోటుతో ప్రయాణికుడి మృతి

అమలాపురం రూరల్: మండలంలోని రంగాపురం గ్రామానికి చెందిన కోడూరి రామకృష్ణ (65) ఆర్టీసీ బస్సులో ప్రయాణం చేస్తుండగా గుండెపోటు రావడంతో మృత్యువాత పడ్డాడు. బంధువులను కలిసేందుకు కాకినాడ వెళుతుండగా ఈ దుర్ఘటన చోటు చేసుకుంది.

యువకుల ఆర్థిక సాయం

అల్లవరం: అనారోగ్యంతో రాజమండ్రి స్వతంత్ర ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న దేవగుప్తం గ్రామానికి చెందిన పినమాల నారాయణకు నల్లగుంట, చింతలమెరక ప్రాంతాలకు చెందిన యువకులు రూ.61 వేల ఆర్థిక సాయాన్ని సోమవారం అందించారు. రాజమండ్రిలో చికిత్స పొందుతున్న నారాయణను పరామర్శించారు.

మృతుని నేత్రాలు దానం

తాళ్లరేవు: పి.మల్లవరం గ్రామానికి చెందిన తోట రామకృష్ణ(75) సోమవారం మృతి చెందారు. ఈ నేపథ్యంలో ఆయన నేత్రాలను కాకినాడ బాదం బాలకృష్ణ ఐ బ్యాంకుకు దానం చేశారు. సామాజిక కార్యకర్త ధూళిపూడి బాబి రామకృష్ణ కుటుంబ సభ్యులతో సంప్రదించి రామకృష్ణ కార్నియాలను ఐ బ్యాంకుకు అందజేశారు.

జేఈ లంచం తీసుకోవడంపై ఫిర్యాదు

అమలాపురం రూరల్: అల్లవరం మండలం గోడిలంక గ్రామంలోని రాజుగారి వీధిలో సర్పంచ్‌తో పాటు కొంత మంది పంచాయతీ సిమెంటు రోడ్డును జేసీబీతో ధ్వంసం చేసిన సంఘటపై గోడిలంక గ్రామానికి రుద్రరాజు వెంకటరాజు గతంలో కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. అయితే విచారణ చేయడానికి వచ్చిన అల్లవరం మండల జేఈ తన వద్ద లంచం తీసుకున్నారని రుద్రరాజు వెంకటరాజు కలెక్టర్‌కు సోమవారం ఫిర్యాదు చేశారు. విచారణ చేయాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు.

ఆవుకు అత్యవసర వైద్యం

అమలాపురం టౌన్: స్థానిక గౌతమ మహర్షి గో సంరక్షణ సమితి గోశాలలో ఓ ఆవు ప్రాణాపాయ స్థితితో కొట్టు మిట్టాడుతుండగా పశు సంవర్ధక శాఖ సహాయ సంచాలకులు డాక్టర్ విజయరెడ్డి వైద్యం అందించారు. గంట సమయం పాటు గోవుకు వైద్యం అందించేందుకు శ్రమించారు.

వేదికపై భూమి పూజలా!

యానాం: అభివృద్ధి పనుల కోసం మూడున్నర ఏళ్లుగా పోరాడుతున్నా జరగని పనులు కేవలం 10 నిమిషాల్లో ఒకే వేదికపై పరిష్కారం కావడంపై ఎమ్మెల్యే గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్ ఆశ్చర్యాన్ని వ్యక్తం చేశారు. శిలా ఫలకాల ద్వారా ఒకే వేదికపై భూమి పూజలు చేయడం యానాంలోనే సాధ్యమని విమర్శించారు.

సంప్రదాయ బద్ధంగా సంక్రాంతి సంబరాలు



భోగి మంట వెలిగించి సందడి చేస్తున్న వాసవీ ఇంటర్నేషనల్ గవర్నర్ రాఘవ, క్లబ్ మహిళా ప్రతినిధులు

అమలాపురం టౌన్: వాసవీ క్లబ్ ఇంటర్నేషనల్ గవర్నర్ యెండూరి రాఘవ ఆధ్వర్యంలో స్థానిక వాసవీ కన్యకా పరమేశ్వరి కల్యాణ మండపంలో సంక్రాంతి సంబరాలు సోమవారం సంప్రదాయ బద్ధంగా జరిగాయి. వాసవీ క్లబ్‌కు చెందిన మహిళలంతా పాల్గొని సంక్రాంతి సంబరాలలో సందడి చేశారు. గొబ్బెమ్మలు, ముత్యాల ముగ్గులు తీర్చిదిద్దారు. గంగిరెద్దుల ప్రదర్శనలు, హరిదాసు కీర్తనలు, భోగి మంటల ప్రదర్శనతో రంజింపజేశారు. సంబరాలకు వాసవీ ఇంటర్నేషనల్ సెక్రటరీ బోడా ప్రకాష్, అమలాపురం స్టేట్ బ్యాంక్ రీజనల్ మేనేజర్ వంశీకృష్ణ ముఖ్య అతిథులుగా పాల్గొని ప్రసంగించారు. సంక్రాంతి సంబరాల అనంతరం వాసవీ ఇంటర్నేషనల్ గవర్నర్ యెండూరి రాఘవ అధ్యక్షతన జిల్లా క్లబ్ క్యాబినెట్ ప్రమాణ స్వీకారం జరిగింది. తూర్పు గోదావరి జిల్లా ఆర్య వైశ్య మహాసభ అధ్యక్షురాలు యెండూరి సీతామహాలక్ష్మి, కవి కొల్లూరి, అమలాపురం చాంబర్ ఆఫ్ కామర్స్ కార్యదర్శి యెండూరి నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగుల పాఠశాల సందర్శన



దివ్యాంగుల పాఠశాలలో పుదుచ్చేరి అధికారులు

యానాం: పట్టణ పరిధిలోని రాజీవ్ బీచ్ సమీపంలోని ఉమా ఎడ్యుకేషనల్ అండ్ టెక్నికల్ సొసైటీ ఆధ్వర్యంలో దివ్యాంగుల ప్రత్యేక పాఠశాలను సోమవారం పుదుచ్చేరి మహిళా, శిశు సంక్షేమశాఖ డిప్యూటీ డైరెక్టర్ అర్ముగం, ఫీల్డ్ ఆఫీసర్ కరుణానిధి సందర్శించారు. ఈ సందర్భంగా సంస్థ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఎస్పీ రెడ్డి దివ్యాంగులకు ఏవిధంగా విద్యనందిస్తుదీ వివరించారు. ఫిజియోథెరపీ తో పాటు స్కూలుకు రాలేని దివ్యాంగ చిన్నారులకు హోమ్ బేస్డ్ విధానం ద్వారా విద్యను అందిస్తున్నట్లు తెలిపారు. ఎస్పీరెడ్డి అందిస్తున్న సేవలకు అధికారులు అభినందించారు. కార్యక్రమంలో చింతా రామజోగి, కో డైరెక్టర్ సత్యనారాయణరెడ్డి, ప్రిన్సిపాల్ నాయుడు, కె శ్రీనివాస్ పాల్గొన్నారు.

వ్యాను బోల్తా: పలువురికి గాయాలు



సుంకరపాలెం బైపాస్ జంక్షన్‌లో బోల్తా పడిన వ్యాను

తాళ్లరేవు: జాతీయ రహదారిలోని సుంకరపాలెం బైపాస్ జంక్షన్‌లో సోమవారం వ్యాను అదుపు తప్పి బోల్తా పడింది. స్థానికులు తెలిపిన వివరాల మేరకు తాళ్లరేవు నుంచి అమలాపురం ఐస్ క్యాన్ల లోడ్‌తో వెళుతున్న వ్యాను ప్రమాదవశాత్తూ అదుపుతప్పి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో వ్యానులో ప్రయాణిస్తున్న ఆరుగురితో పాటు అటుగా వెళుతున్న ఆటో డ్రైవర్‌కు స్వల్ప గాయాలయ్యాయి. వారిని హుటాహుటిన యానాం ప్రభుత్వాస్పత్రికి తీసుకువెళ్లారు.